# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## వీరన్నపేట శివారులో చిరుత సంచారం..

**- చిరుతదాడిలో హతమైన వీధికుక్క - భయాందోళనలో స్థానికులు**



హతమైన వీధికుక్క

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శివారులో వీరన్నపేట వద్ద చిరుత సంచారం కలకలం రేపింది. వీరన్నపేటలోని కేటీఆర్ నగర్ డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాంతంలో చిరుత సంచరించినట్లు స్థానిక గొర్రెల కాపరులు గుర్తించారు. అక్కడే ఓ వీధికుక్కను చంపేసినట్లు చెబుతున్నారు. గత రెండు రోజులుగా చిరుత అరుపులు రాత్రి పూట వినిపిస్తున్నాయని స్థానికులు తెలుపడంతో విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ ప్రాంతాలో దాదాపు 10వరకు చిరుతలు సంచిరిస్తుంటాయని, ఒంటరిగా రాత్రిళ్లు ఎవరూ బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. చిరుత ఇండ్లలోకి వస్తుందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, రాత్రిళ్లు చిరుత బారినుంచి తమను కాపాడాలని కోరుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వై నిరంజన్ వివరణ కోరగా స్థానికులు, వార్డు కౌన్సిలర్ సమాచారం మేరకు శుక్రవారం వీరన్నపేట కేటీఆర్ నగర్‌ను సందర్శించామని, కుక్క చిరుతను చంపినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. చిన్నపిల్లలు అడవిలోని ఒంటరిగా వెళ్లనివ్వొద్దని, ఎవరైనా వెళ్లాల్సి వస్తే ఇద్దరు ముగ్గురు కలిసి వెళ్లాలని సూచించారు.

## గ్రూప్-4 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం..

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం నిర్వహించే గ్రూప్ -4 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గ్రూప్-4 నిర్వహణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జూమ్ మీటింగ్ నిర్వహించగా జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రూప్-4 పరీక్షలు 16632 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని సదుపాయాలతో కూడిన 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షను పకడ్బందిగా నిర్వహించేందుకు అనుభవజ్ఞులైన చీఫ్ సూపరిం టెండెంట్‌లు, లైజన్ అధికారులు, రూట్ అధికారులను నియమించుకోవడం జరిగిందన్నారు. ఇన్విజిలేటర్లకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి నియమ నిబంధనలపై అవగాహన కల్పించడం జరిగింది. ఉదయం 10గంటలకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 2వ పేపర్ పరీక్ష ప్రారంభమవుతుందని, దీని కొరకు ఉదయం పరీక్షకు అభ్యర్థులను ఉదయం 8.30గంటల నుంచి 9.45వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. తర్వాత ఒక నిముషం ఆలస్యం చేసిన పరీక్ష కేంద్రంలో అనుమతించడం జరగదన్నారు. మధ్యాహ్నం పరీక్షకు 1.30 నుంచి 2.15 వరకు అనుమతించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. ఎవరైన అభ్యర్థులకు హాల్ టికెట్‌పై ఫోటో కనిపించని పక్షంలో 3పాస్ పోర్టు సైజ్ ఫోటోలపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకొని తీసుకొని రావాలన్నారు. ప్రతి అభ్యర్థి తన హాల్ టికెట్‌తో పాటు అదనంగా ఒక గుర్తింపు కార్డును విధిగా వెంట తీసుకొని రావాలని, దివ్యాంగులు పరీక్ష స్వయంగా రాయలేని వారి కోసం పరీక్ష కేంద్రంలోనే సహాయకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వారు వారి వెంట మరొకరిని తీసుకు రావాల్సిన అవసరం లేదన్నారు. గ్రూప్-4 పరీక్షకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్‌లైన్ నెంబరు 08546-230201కు ఫోన్ చేయాలన్నారు. పరీక్షలను పకడ్బందిగా నిర్వహించేందుకు ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, రూట్ అధికారులు సకాలంలో చేరుకొని పరీక్షలు సజావుగా నిర్వహించే విధంగా పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు 144 సెక్షన్ అమలు, జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలను చేరుకునే విధంగా ప్రత్యేక రూట్‌లో బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జూమ్ మీటింగ్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్ పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్

## బతకాలంటే హైదరాబాద్ రావాల్సిందేనా..

**- బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30, ప్రభాతవార్త :** సాయిచంద్ హైదరాబాద్‌లో ఉంటే బతికే వాడని మంత్రి కేటీఆర్ అన్నాడని, ప్రాణం కాపాడుకోవలంటే అందరూ హైదరాబాద్ రావాలా, అభివృద్ధి కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేస్తారా అని బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల కేంద్రంలో బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట, అచ్చంపేట, అలంపూర్ లాంటి సుదూర ప్రాంతాల నుంచి అందరూ హైదరాబాద్ రావాలా, అందరికీ యశోదాలో చికిత్స అందిస్తారా అంటూ ప్రశ్నించారు. కారకొండ అస్వస్థతకు గురైన సమయంలో ఎక్కడికి వెళ్లాలో తెల్వక ఓ ప్రైవేట్ దవాఖానకు వెళ్లారని, నిజంగా నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో వసతులు, అన్ని రకాల సౌకర్యాలు, కార్డియక్ సేవలు ఉంటే ఇవాలా సాయిచంద్ బతికేవాడన్నారు. బీఆర్ఎస్ నాయకుడికే ప్రభుత్వ దవాఖానలో వైద్యం అందని పరిస్థితి ఉందని ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నందమూరి హరికృష్ణ, కైకాల సత్యనారాయణ, కృష్ణ, దాసరి నారాయణరావుకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేశారని, సాయిచంద్ ఏపాపం చేశాడని అధికార లాంఛనలతో చేయలేదో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న, గూడ అంజయ్య విషయంలోనూ బహుజన నేతలనే అధికార లాంఛనాలతో అంత్యక్రయలు చేయలేదని, కేవలం బహుజన బిడ్డలను, నేతలను కరివేపాకుల్లా వాడుకుంటున్నారని బహుజన సమాజం మేలుకోవాలన్నారు. బ్రాహ్మణ, వెలమ, రెడ్డి దొరలే రాజ్యాధికారం చేపడుతున్నారే తప్పా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు ఎప్పుడు రాజ్యాధికారం చేపట్టేదని చెప్పాలన్నారు. బహుజనులు ఇప్పటికైనా మేలుకోవాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి..

- **తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలి**
- **ఇళ్ల నుండి చెత్తను, ప్లాస్టిక్‌ను మురుగు కాలువలో పడేస్తే వారిని గుర్తించి అపరాధ రుసుము వసూలు చేయాలి**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**
- **మున్సిపాలిటీ పరిధిలోని 26,29,33వ వార్డులలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**వనపర్తి, జూన్30, ప్రభాతవార్త:** పారిశుద్ధ్య కార్మికులు పారిశుద్ధ్య పనులు సజావుగా నిర్వహించడంతో పాటు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. శుక్రవారం ఉదయాన్నే వనపర్తి జిల్లా కేంద్రం మున్సిపాలిటీ పరిధిలోని 26, 29, 33వ వార్డులలో తిరుగుతూ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను సైతం అడిగి తెలుసుకున్నారు. ఉదయాన్నే తడి పొడి చెత్త వేరు వేరుగా సేకరించాలని, ఎవరైనా ఇళ్ల నుండి తమ చెత్తను ప్లాస్టిక్‌ను మురుగు కాలువలో పడేస్తే అలాంటి వారిని గుర్తించి అపరాధ రుసుము వసూలు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, 15 రోజులకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి 15 రోజులకు మున్సిపాలిటీ ఆవరణంలోనే హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తామని, అక్కడే వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రతి నెల జీతం పడుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ భవనాన్ని, టౌన్ హాల్, లలితకళా తోరణం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూరినత చేయాలని నాణ్యతతో లోపం లేకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మున్సిపాలిటీ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్





పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# గ్రూప్-4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు..!



- 15నిమిషాల ముందే గేట్లు బంద్
- పరీక్షా కేంద్రాల విద్యాసంస్థలకు శనివారం సెలవు
- రెండు సెషన్లలో ఎగ్జామ్ నిర్వహణ
- తాళి, మెట్టెలు తీయాలనే నిబంధన లేదు..
- భారీ దరఖాస్తుల నేపథ్యంలో మండలాల్లోనూ సెంటర్లు
- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో పరీక్ష రాయనున్న 86,988 మంది అభ్యర్థులు
- 264పరీక్షా కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



| జిల్లా | అభ్యర్థులు | పరీక్షా కేంద్రాలు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 34459 | 111 |
| నాగర్‌కర్నూల్ | 16637 | 50 |
| వనపర్తి | 13648 | 46 |
| నారాయణపేట | 7324 | 28 |
| జోగులాంబ గద్వాల | 14920 | 49 |
| మొత్తం | 86988 | 264 |

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రూప్ -4 ప్రిలిమినరీ పరీక్షకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకున్నది. శనివారం నిర్వహించే ఎగ్జామ్‌కు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే సమీక్ష నిర్వహించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్ -4 పరీక్ష రెండు సెషన్లలో నిర్వహించనుండగా పరీక్ష ప్రారంభానికి పావుగంట ముందే సెంటర్ గేట్లు మూసివేయనున్నారు. అందుకే విద్యార్థులకు కనీసం గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని అధికార యంత్రాంగం సూచిస్తున్నది.**

*- మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30, ప్రభాతవార్త*

వేలాదిమంది నిరుద్యోగులు ఎవురుచూస్తున్న గ్రూప్-4 పరీక్షకు నేటి ఉదయం నుంచి ప్రారంభంకానున్నది. గ్రూప్ -4 పరీక్ష రెండు సెషన్లలో నిర్వహిస్తారు. 01న ఉదయం 10.00గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పేపర్ -1, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పేపర్ -2 ఉంటుంది. ఉదయం 8.30గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుంది. పావుగంట ముందే అనగా ఉదయం 9.45గంటలకు, మధ్యాహ్నం పేపర్-2కు సంబంధించి 2.15గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసేస్తారు. అభ్యర్థులు గమనించాలని నిర్వహకులు సూచిస్తున్నారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు, వైద్య ఆరోగ్య శాఖ, ఆశ, ఏఎన్ఎం, ప్రథమ చికిత్స, తాగునీరు, టాయిలెట్ సౌకర్యం మొదలగు ఏర్పాట్లు చేయాలన్నారు. బందోబస్తు చర్యలకు సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ నరసింహ తెలిపారు.

**తనిఖీలు ఇలా..**

గతంలో గ్రూప్ -1 పరీక్షా పత్రాలు లీక్ అవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నది. దీనికోసం ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించింది. కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లతో సమావేశాలు నిర్వహించి పకడ్బందీ చర్యలకు ఆదేశించింది. పరీక్షల అథారిటీ అధికారులుగా కలెక్టర్లను, చీఫ్ కో ఆర్డినేటర్లుగా సబ్ కలెక్టర్లను నియమించింది. చీఫ్ కోఆర్డినేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లకు, ఇన్విజిలేటర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు.

- **పరీక్షా కేంద్రం గేట్ల వద్ద హాల్ టికెట్ పరిశీలిస్తారు.**
- **అభ్యర్థి సంతకాన్ని సరిపోల్చుతారు.**
- **గుర్తింపు ఫొటో తప్పనిసరి వెంట తీసుకెళ్లాలి.**
- **సెంటర్‌లో నామినల్ రోల్‌ను పరిశీలిస్తారు.**
- **అభ్యర్థి వేలిముద్రలను స్వీకరిస్తారు.**

**ఇవీ నిబంధనలు..**

ప్రతి కేంద్రం వద్ద సీసీ కెమెరా నిఘా ఉంటుంది. బూట్లు కాకుండా చెప్పులుధరించి పరీక్షకు హాజరుకావాలి. బయోమెట్రిక్ విధానాన్ని అమలులో భాగంగా వేలిముద్రలను త్వీకరిస్తారు. జంబ్లింగ్ విధానంలో ప్రశ్నలు రూపొందించడంతో కాపీయింగ్‌కు పూర్తిగా చెక్ పెట్టొచ్చు. గతంలో ఏబీసీడీ ప్రశ్నాపత్రాల పేరుతో నాలుగు ప్రశ్నాపత్రాలు వరుస క్రమంలో వచ్చేవి. కానీ ఈ సారి ఎక్కువ సిరీస్‌లో ప్రశ్నాపత్రాలు వచ్చేలా చర్యలు తీసుకుటున్నారు. దీంతో కంప్యూటర్‌లో ప్రశ్నలను జంబ్లింగ్ చేశారు. హాల్ టికెట్‌లో ఫొటో సరిగా లేకపోతే అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా, అభ్యర్థులు మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలను గజిటెడ్ అధికారులతో సంతకం చేయించి తీసుకురావాలి. అయితే తాళిబొట్టు, మెట్టులు తీయాలనే నిబంధన ఏమీ లేదని హిందూ సంప్రాదాయాన్ని అవమాన పర్చేలా నిబంధనలు లేవని, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి ఖండించారు. యువతీ యువకులకు సరిపడా సిబ్బందిని నియమించామని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహిళా సిబ్బందే చెకింగ్ చేసేలా చర్యలుతీసుకున్నామని మీడియాకు తెలిపారు. పరీక్షా కేంద్రానికి 100-200మీటర్ల దూరంలో ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఫోటో లు, వీడియోలు తీయొద్దని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు.

**పకడ్బందీ ఏర్పాట్లు చేశాం..**

మహబూబ్‌నగర్ జిల్లాలో గ్రూప్-4 పరీక్షకు పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. 111మంది చీఫ్ సూ పరింటెండెంట్లు, 111మంది లైజన్ అధికారులు, 20మంది రూట్ అధికారులను నియమించాం. ఉదయం 8గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించడం జరుగుతుంది. ఉదయం 9.45గంటల వరకే సెంటర్ గేట్లు మూసే స్తాం..మధ్యాహ్నం కూడా పావుగంట ముందే పరీక్షా కేంద్రం గేట్లు మూసేస్తారు. తర్వాత వచ్చినా ఉపయోగం ఉండదు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు తప్పనిసరి గుర్తింపు కార్డు తీసుకురావాలి.

*- జి రవినాయక్, కలెక్టర్, మహబూబ్‌నగర్*

## 9 ఏళ్ల పాలన...దేశానికే ఆదర్శం

**అభివృద్ధికి ఆకర్శితులై బిఆర్ఎస్ పార్టీలో నిరంతర చేరికలు**

**ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన ఉడిత్యాల కాంగ్రెస్, బిజెపి యువ నాయకులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం సీఎం కెసిఆర్ ఆధ్వర్యంలో తొమ్మిదేళ్లలో జరిగిన, రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలతో దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామానికిచెందిన సుమారు 40మంది కాంగ్రెస్ బిజెపి యువనాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ మేరకు నూతన సభ్యులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, పార్టీఅభ్యున్నతికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



జడ్చర్లలో 16వ వార్డులో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**పెద్దడ్రైన్ పనులు పరిశీలన...**

ఎమ్మెల్యే డా. చర్లకొల్ల లక్ష్మారెడ్డి, జడ్చర్ల మున్సిపల్ పట్టణ పరిధిలో 16వ వార్డులో జరుగుతున్న పెద్దడ్రైన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మిరవిందర్, వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ పిట్టల మురళి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, నాయకులు అయుబ్, పరమటయ్య పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ...**

గత నాలుగు రోజుల క్రితం గండెపోటుతో జడ్చర్ల మున్సిపల్ పట్టణ పరిధి 12వ వార్డులో బాలవర్ధన్, 18వ వార్డులో కప్పల శ్రీనివాస్ మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఇంటికి వెళ్లి వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి రవిందర్, 12వ వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్, 18వ వార్డు బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి ముఖీద్, మున్సిపల్ కౌన్సిలర్లు చైతన్య హరికృష్ణగౌడ్ పాల్గొన్నారు.

## ఆదివాసీ, గిరిజనులకు పోడు పట్టాలు...!

**- రాష్ట్ర ముఖ్యమంత్రి సాహసోపేత నిర్ణయం - ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**





పోడు పట్టాల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**అచ్చంపేట, జూన్ 30 ప్రభాతవార్త:** ఎన్నో సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూమియే జీవనాధారం అనుకొని జీవిస్తున్నప్పటికి చట్టపరమైన హక్కు లేదని అటవీశాఖ అధికారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆదివాసీ, చెంచు గిరిజనులకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నేడు పోడుపట్టాలు అందజేస్తున్నదని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం మ ధ్యాహ్నం అచ్చంపేటలోని శ్యాం ఫంక్షన్ హాల్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ శాంతకు మారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌లతో కలిసి గిరిజన లబ్ధిదారులకు పోడు పట్టాలను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ 75సంవత్సరాల నుంచి అటవీ ప్రాంతంలో జీవిస్తూ తాము సాగుచేసుకుంటున్న భూమినే నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నప్పటికి పంట వేసే ప్రతి సారి అటవీ శాఖ అధికారులతో తగువు పడుతూ తమ భూమిపై తమకు హక్కులు లేవా అని బాధపడుతున్న నిరుపేద రైతులకు తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ము ఖ్యమంత్రి సాహసోపేత నిర్ణయం తీసుకొని అర్హులైన వారందరికి రాష్ట్ర వ్యాప్తంగా పోడు పట్టాలు మంజూరు చేశారు. నేడు నాగర్‌కర్నూల్ జిల్లాలో 1200 మందికి 3వేల ఎకరాల భూమకి అటవీ హక్కు పత్రాలను అందించారు. రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ హఠన్మారణంతో బాధ ఒక వైపు, ఈ రోజు తన ఎంతో కాలంగా పోడు పట్టాల కొరకు ఎదురు చూస్తున్న గిరిజనులకు తన పుట్టిన రోజు సందర్భంగా గిరిజనులకు పోడు పట్టాలు అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎప్పుడు ప్రజల్లో ఉంటూ ప్రజలకు ఏం కావాలో ఆలోచించే వ్యక్తినని, గిరిజనుల పోడు పట్టాల కొరకు అసెంబ్లీలో గలమెత్తానని తెలిపారు. భూమినే నమ్ముకొని బతుకుతున్న గిరిజనులు ఏవో చిన్న చిన్న కాంణాల వల్ల ఇప్పుడు పోడు పట్టాలు మంజూరు కానీ వారికి ముఖ్యమంత్రితో మాట్లాడి పట్టాలు ఇప్పించే బాధ్యత తనదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ శాంతకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు ఏం చేపట్టలేదని, తెలంగాణ - మిగతా2లో..



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్



పట్టాల పంపిణీకు హాజరైన రైతులు

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి:ఎస్‌పి కె.సృజన

**గద్వాల ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త :** నేటి నుండి 31 వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ నిర్వహణకు సంబంధించి ఐడిఓసి కార్యాలయంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్ల ఎస్పీ కె. సృజన చైల్డ్ వెల్ఫేర్ కమిటి, లేబర్ డిపార్టుమెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్టుమెంట్, హెల్త్ డిపార్టుమెంట్ వివిధ డిపార్టుమెంట్ అధికారులు, సిబ్బందితో కలిసి ముస్కాన్ టీమ్ 9 పోస్టర్‌ను విడుదల చేశారు. ఎస్పీ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు బాల కార్మికులుగా పని చేస్తున్న పిల్లలు గొర్రెల పశువులు, కాపరులుగా, కిరాణం షాపులలో మెకానిక్ షాపులలో, హోటళ్లలో పనిచేస్తూ పిల్లలు రోడ్డుపై భిక్షాటన చేస్తున్న ఇటుక బట్టీలలో, పౌల్ట్రీ ఫామ్‌లలో ఉన్న, మరే ఇతర ప్రదేశాలలో తప్పిపోయిన వదిలివేయబడిన పిల్లలు బాలకార్మికులుగా పని చేస్తున్న పిల్లలు ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేదా స్టేట్ హోమ్‌కు పంపించడం జరుగుతుందని చిన్న పిల్లలతో ఎవరైనా బలవంతంగా భిక్షాటన, వెట్టిచాకిరి చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో శిశు సంక్షేమశాఖ అధికారి ముసాయిదాబేగం, సిడబ్ల్యుసి చైర్మన్ సహదేవుడు, డిసిపిఓ నరసింహ, డిఎల్ఓ మహేష్, విద్యాశాఖ ఎడి ఇందిర, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి కృష్ణ, వైద్యాధికారి మేరమ్మ, ముస్కాన్ టీమ్ ఇంఛార్జి ఎస్సై కేశవరావు, డిపిఆర్ఓ చెన్నమ్మ, సిడబ్ల్యుసి సభ్యులు ఉమాభారతి, జయభారతి, పోలీస్ సిబ్బంది సుధారాణి, రాజు, భారత్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

## గ్రూప్ 4 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి..

**తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి**

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త :** జులై 1న టీఎస్‌పీఎస్‌సి గ్రూప్ 4 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం గ్రూప్ 4 పరీక్షల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌లతో హైదరాబాద్ నుండి దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 1న జరగనున్న గ్రూప్ 4 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో ఇబ్బందులు లేకుండా చూడాలని, అవసరమైన సిబ్బందిని అదనంగా నియమించుకోవాలని సూచించారు. పరీక్షల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు సిబ్బందిని సమన్వయపరచుకొని సకాలంలో సిబ్బంది హాజరయ్యేలా ఆదేశించాలని సూచించారు. దూర ప్రాంతాలకు పరీక్ష సామాగ్రిని తీసుకువెళ్లే రూట్లలో అదనపు వాహనాలను సమకూర్చుకోవాలని, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో ఖచ్చితంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసి రికార్డు చేయడంతో పాటు రికార్డును పెన్‌డ్రైవ్ ద్వారా పంపించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, దూరప్రాంతాల నుండి వచ్చే వారి కొరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు హాజరయ్యే అభ్యర్థులందరు ఏదైనా ఒక ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డులను వెంట తీసుకురావాల్సి ఉంటుందని, ఫోటోలు హాల్ టికెట్‌లో ఫోటోలు రానట్లయితే 3 పాస్ పోర్ట్ ఫోటోతో గెజిటెడ్ అధికారి అటెస్టేషన్‌తో తీసుకురావాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. ఉదయం, తిరిగి సాయంత్రం జరిగే పరీక్షలకు వేర్వేరుగా బయోమెట్రిక్ విధానాన్ని అమలు పరచాలని సూచించారు. పరీక్షలలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పరీక్షా కేంద్రంలోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని, ఎవరైనా సెల్‌ఫోన్‌లను తీసుకువస్తే వాటిని భద్రపరచడానికి కేంద్రాల వద్ద ప్రత్యేకకౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలలో మంచినీరు, టాయిలెట్‌లు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాన్ని గురించి తెలిపేలా డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో గ్రూప్ 4 - మిగతా2లో..



క్వాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన..

**- మహబూబ్‌నగర్‌లో పెరిగిన కూరగాయల ధరలకు వ్యతిరేఖంగా ఆందోళన**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30, ప్రభాతవార్త :** నిత్యావసర సరుకుల ధరలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పెరిగిన కూరగాయల ధరలతో సామాన్యుడి విరినట్లు అవుతుందని పెరిగిన ధరలకు నిరసనగా శుక్రవారం మహిళా కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు వసంతారాఘవేందర్‌రాజు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ధరలు అందుబాటులోకి తేవాలని డిమాండ చేశారు. పట్టణంలోని కూరగాయాల మార్కెట్‌లో విక్రయదారులు, కొనుగోలు దారలతో మాట్లాడారు. కూరగాయల ధరలతో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ధరలు తగ్గించని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## కల్వకుర్తి పట్టణ శక్తి కేంద్రాల బూత్ అధ్యక్షలకు సమీక్షా సమావేశం

**కల్వకుర్తి, జూన్ 30 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణ శక్తి కేంద్రాల బూత్ అధ్యక్షులకు నిర్వహించిన సమావేశానికి జాతీయ ఓబీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కారక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల కు వివరించాలన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు బోడ నరసింహ, ఆమనగల్లు మున్సిపాలిటి చైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ కండెహరిప్రసాద్, నాయకులు మొగిలిదుర్గప్రసాద్, నీరుకంటి రాఘవేందర్‌గౌడ్, శేకర్‌రెడ్డి, రవిగౌడ్, బాబీదేవ్, బీజేవైఎం అధ్యక్షులు సంపాతి శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



## బీటీ రోడ్డు పనులను పరిశీలించిన గోలి శ్రీనివాస్‌రెడ్డి

**వెల్దండ, జూన్ 30 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చేపడుతున్న బీటీ రోడ్డు పనులను బీఆర్ఎస్ నేత గోలి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటీ రోడ్డు నిర్మాణానికి జాతీయ రహదారి నుంచి 3కిలో మీటర్ల పరిధిలో రోడ్డును చేపడుతున్నామని, రూ.2.60కోట్లతో చేపడుతున్న పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. గ్రామ బీటీ ఏర్పాటుతో మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినాయక్, శంకర్‌నాయక్, సుమన్‌నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



**మృతుడి కుటుంబానికి పరామర్శ....** వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామానికి చెందిన చెన్నోజు చంద్రమౌళి మాతృమూర్తి చెన్నోజు సుశీలమ్మ మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నేత గోలి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, వెంకటయ్య, సుభాష్, సుమన్, శివ, గణేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును సందర్శించిన మున్సిపల్ వైస్‌చైర్మన్, మార్కెట్ చైర్మన్

**వనపర్తి, జూన్30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఏదుల రిజర్వాయర్ పనులు వనపర్తి వాకింగ్ బృందం శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఏదుల రిజర్వాయర్‌ను అత్యంత స్వల్ప కాలంలో భూసేకరణ సేకరించి నిర్మాణం పూర్తి కావచ్చిందని ఇది మంత్రి నిరంజన్‌రెడ్డి పట్టుదలకు నిదర్శనమని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో పాలమూరు , నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు అందించే గొప్ప ప్రాజెక్టు అని ఇదే కాకుండా వెనుకబడ్డ పాలమూరు ప్రాంతానికి తాగునీటిని కూడా ఈ ప్రాజెక్టు ద్వారా అందించే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ఏదుల, కొంకలపల్లి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నిరంజనరెడ్డి, సీఎం కేసీఆర్, అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టును సందర్శించిన వారిలో వనపర్తి మార్కెట్ చైర్మన్ రమేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ కాగితాల లక్ష్మి నారాయణ , బాదం పాండు, చల్లా రాజశేఖర్, రామేశ్వర్‌రెడ్డి, నూకలసురేష్, విజయ రాములు, సంభు రవి, నూకల నాగరాజు తదితరులు ఉన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్**

**వనపర్తి వైద్య విభాగం, జూన్30, ప్రభాతవార్త:** వర్షాకాలం ఆరంభం కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ పీర్లగుట్ట పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవిశంకర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు , ప్రజలకు వైద్యశాఖ అధికారి ఆరోగ్య సలహాలు ఇవ్వడం జరిగింది. వర్షాకాలం ఆరంభం కావడంతో ఇంటి ఆవరణ నీటి నిల్వ పాత్రలలో దోమలు గుడ్లు పెట్టి దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. నీటి నిల్వ పాత్రలను వారానికి ఒక్కసారైనా శుభ్రపరుచుకుని ఉపయోగించుకోవడం మంచిదని తెలిపారు. నీటి డ్రమ్ములు, హౌజ్‌లపై మూతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. లేనిచో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ఆరంభంలో లార్వా (దోమల గుడ్లు) పగిలి దోమల వృద్ధి గణనీయంగా పెరుగుతుందన్నారు. మన పరిసర ప్రాంతాలు శుభ్రం చేసుకోకపోవడం వల్ల దోమల వృద్ధి పెరిగి దోమకాటుకు రకరకాల వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం చంద్రమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా డీఎస్పీని సన్మానించిన సహాయ ఫౌండేషన్ అధ్యక్షులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30 ప్రభాతవార్త :** జిల్లా డీఎస్పీ మహేష్‌ను సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టంకరి శివప్రసాద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నవీన్, భరత్‌చారి, జయకర్, అనిల్, రాజు, శివ, భరత్, శివకుమార్ పాల్గొన్నారు.



## గ్రూప్ 4 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేల అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో 7324 మంది గ్రూప్ 4 పరీక్ష రాస్తున్న అభ్యర్థుల కొరకు 28 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎగ్జామ్ మెటీరియల్‌ను తరలించడానికి ఉదయం, మధ్యాహ్నం రూట్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజనింగ్ అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులు, అంగన్‌వాడి టీచర్లు, ఆశాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి కేంద్రంలో హాల్ టికెట్‌తో పాటు ఫొటో ఐడెంటిటి కార్డులను పరిశీలించిన తర్వాతనే అభ్యర్థులను లోపలికి అనుమతించేలా ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ప్రతి సెంటర్‌లో ఫ్రిస్కింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. అవసరం దృష్ట్యా అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని సూచించారు. నిబంధనలను పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఆదివాసీ, గిరిజనులకు పోడు పట్టాలు...!

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమాజంలోని అన్ని కులాలు, వృత్తుల వారికి ప్రతి ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్ఓఆర్ చట్టం ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లాలో 2 వేల మందికి దాదాపు 5వేల ఎకరాలకు పోడు పట్టాలు మంజూరు చేశామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో పోడు పట్టాలు అందించడం మొదటిసారి అని తెలిపారు. పోడు పట్టాలు పొందిన వారికి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా హద్దులు నిర్ణయించి గుగూల్ మ్యాప్‌లో హద్దులు చూపిస్తూ పట్టాలు తయారు చేశామన్నారు. పట్టాలు అనంతరం గిరిజనులకు పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పొందిన రైతులందరికి రైతుబంధు, రైతు భీమా వర్తిస్తుందని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పోకల మనోహర్ అన్నారు. అంతకు ముందు హఠన్మరణం పొందిన సాయిచంద్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో అటవీశాఖ ఎఫ్‌డి ఓ విశాల్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్‌రెడ్డి, ఆర్డీఓ పాండునాయక్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

# అచ్చంపేట ప్రజల రుణం తీర్చుకుంటా...

**- ఘనంగా ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జన్మదిన వేడుకలు**

**- అమరుడా అందుకో మా నివాళులు....**



వైద్య శిబిరంలో ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పలువురు నాయకులు

**వంగూరు, జూన్30 ప్రభాతవార్త:** గత రెండు పర్యాయాలుగా అచ్చంపేట నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిని అకాంక్షిస్తూ అమూల్యమైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కుతో గెలిపించి అసెంబ్లీకి పంపిన అక్కాచెల్లెల, అన్నతమ్ముల రుణం తీర్చుకుంటానని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జన్మదినాన్ని పురస్కరించుకొని వంగూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నర్సిరెడ్డి సహకారంతో నవీన మల్టీస్పెషాలిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించి కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి సంబురాలు నిర్వహించారు. వంగూరు, చారకొండ మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే గువ్వల బాలరాజును గజమాల, శాలువాతో సన్మానించారు. అంతకు ముందు ఎమ్మెల్యే గువ్వలకు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు స్వాగతం పలికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నల్లమల్ల ప్రాంతాన్ని అభివృద్ధి పర్చేందుకు ప్రత్యేక కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో నల్లమల్ల ప్రాంతంలో బీడు వారిన భూములకు కృష్ణ జలాల సాగునీటిని అందించి వ్యవసాయ సాగుకు దోహద పడి రైతన్న మోమోలో చిరునవ్వును చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చేందుకు కోటి ఎకరాల మాగాణిగా మారుస్తానని సుమారు కోటి యాభై ఎకరాలకు సాగునీటిని అందించి తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ కేంద్ర ఉత్పత్తిగా మార్చారని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తూ వ్యవసాయ సహాయం క్రింద రైతుబంధు పథకంతో ఎకరాకు రూ.6వేలను అందిస్తూ రైతన్నకు అండగా ఉంటున్నామని ఆయన పేర్కొన్నారు. నల్లమల్ల ప్రాంతంలో వైద్యానికి ఇబ్బందులు లేకుండా అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని నియమించి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వంగూరు మండలంలో రైతు, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ రైతు ప్రభుత్వంగా కొనసాగుతున్నామని ఆయన పేర్కొన్నారు.

**అమరుడా అందుకో మా నివాళులు....**

మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు, గిడ్డంగుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ స్వర్గీయ వేద సాయిచంద్ అకాల మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని, ఆటపాటలతో తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యపరుస్తూ ఉద్యమానికి ఊపిరి పోస్తూ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేసిన వ్యక్తి నేడు మన మధ్య లేకపోవడం ఎంతో బాధకరమని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో సాయిచంద్ మృతికి రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎంపీపీ భీమమ్మ, సర్పంచ్ అక్కి లావణ్య, వంగూరు, చారకొండ సింగిల్‌విండో చైర్మన్‌లు కుడుముల సురేందర్‌రెడ్డి, గుర్వయ్యగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మందా రాజేందర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు హామీద్, కేటీఆర్ సేవా సమితి అధ్యక్షులు అంకు సురేందర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు అంజి, నాయకులు ఆనంద్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, బాలస్వామి, గణేష్‌రావు, నరేందర్‌రావు, రాజేందర్‌రెడ్డి, జంగయ్య, శ్రీనివాస్, కృష్ణ, శ్రీపతిరావు, మండల యూత్ అధ్యక్షులు దేవా, రాజా రాంగరావు, ఎల్లగౌడ్, నర్సింహ్మారెడ్డి, లాలుయాదవ్, నరేందర్‌గౌడ్, హరినాథ్ తదితరులు ఉన్నారు.

## బీజేపీని గెలిపించాలి... మోడీకి బాసటగా నిలువాలి..

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండా మణెమ్మనగేష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త:** దేశంలో అధికారంలోకి వచ్చిన తొమ్మిది సంవత్సరాల్లో ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు బాసటగా నిలుస్తూ రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని, ఎన్నికలు ఏమైనా బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుకు సహకరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండా మణెమ్మనగేష్ కోరారు. శుక్రవారం తాడూర్ మండలం ఇంద్రకల్ గ్రామంలో పార్టీ జాతీయ కమిటీ పిలుపుమేరకు మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి బీజేపీ చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోహిత్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి ఎం.ఆంజనేయులు, మండల కిసాన్ మోర్చాఅధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు బాలమణి, ఓబీసీ మోర్చా నాయకులు చాపల స్వామి, నాయకులు అంజి, సందీప్‌రెడ్డి తదితలు ఉన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండా మణెమ్మనగేష్

## 3న అప్పంపల్లిలో రైతు అవగాహనసదస్సు..

**- గ్రామభారతి జిల్లా అధ్యక్షుడు అమవాది రాజానర్సింహ్మ**

**దేవరకద్ర, జూన్ 30 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం అప్పంపల్లిలో జులై3న రైతు అవగాహనసదస్సు నిర్వహిస్తున్నట్లు గ్రామభారతి జిల్లా అధ్యక్షుడు అమవాది రాజానర్సింహ్మ, ప్రచార విభాగం కార్యదర్శి గుముడాల చక్రవర్తిగౌడ్‌లు తెలిపారు. గ్రామభారతి అధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రసాయనిక ఎరువులు విచ్చిలవిడిగా వాడటం వల్ల భుమి విషతుల్యంగా మారుతుందన్నారు. తినే ఆహారంలో రసాయనిక ఆనవాళ్లు కనిపిస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తపరిచారు. అంతేగాకుండా ఎన్నో వింతరోగాలు కూడ వస్తున్నాయన్నారు. చివరికి క్యాన్సర్ లాంటి భయంకరమైన రోగాలభారిన పడి మరణాలు సంభవిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తపరిచారు. జీవరాశులు సైతం మృత్యువు ఒడిలోకి చేరుకొంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో నేలతల్లిని కాపాడుకొనేందుకు కొంతమంది రైతులు ప్రకృతిసేధ్యం చేస్తూ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందిస్తున్నారన్నారు. ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అలాంటి వారికి గ్రామభారతి సంస్థ తమ వంతు సహకారం అందిస్తూ రైతు అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తుందన్నారు. అందులో భాగంగానే వచ్చే నెల3న అప్పంపల్లి ఉన్నత పాఠశాల వద్ద ఈ రైతుల పకృతి అవగాహనసదస్సును ఏర్పాటు చేస్తున్నామన్నారు. కావున ఈ సదస్సుకు అప్పంపల్లితో పాటు పరిసర గామాలైన దాసర్‌పల్లి, తిర్మలాపూర్, ముచ్చింతల, గుడిబండ, మీన్గవానిపల్లి, కౌకుంట్ల గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ సదస్సులో పకృతి సేధ్యం విధానాలు, సందేహాలను రైతులు నివృత్తి చేసుకోవాలని వారు కోరారు.

## ప్రజల పౌర హక్కులపై అవగాహన కల్పించిన పోలీస్, రెవెన్యూ అధికారులు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త :** ప్రతినెల చివరి తేదీన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించడం జరుగుతుందని జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోలీస్, రెవెన్యూ అధికారులు కొన్ని గ్రామాలను సందర్శించి ప్రతినెల పౌర హక్కులదినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కొన్ని సంవత్సరాల క్రితం కుల వివక్ష ఉండేదని ప్రస్తుతం అంతగా లేనప్పటికి అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని, కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైఉందని దానికి కృషిచేయాలన్నారు. కుల నిర్మూలనకు, ఎస్సీ, ఎస్టీ కులాల వారిని చైతన్యపరచుటకు, వారిని అభివృద్ధివైపు నడిపించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని అన్నికులాలకు చెందినవారిని వారితో సమావేశం నిర్వహించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం 1989 ఈచట్టం విశిష్టత, వినియోగించే విధానాల గురించి, పిఓఎ, (పోక్సో చట్టం), పిసిఆర్ (పౌరహక్కుల రక్షణ చట్టం) చట్టాలను అమలు చేయు విధానం గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడం కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడం వల్ల అందరికి అవగాహన చైతన్యం ఉంటుందన్నారు. పౌరహక్కుల దినం నిర్వహించడం గ్రామాల్లో ఇంకా కుల వివక్ష అంటరానితనము దళితుల భూవివాదాలు, మహిళలపై అత్యాచారాలు నిరోధించడం జరుగుతుందన్నారు. కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమతాల్లో తేడా లేకుండా అందరూ కలిసిక ట్టుగా ఐకమత్యంగా ఉండాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివి..

**- మహబూబ్‌నగర్‌లో 11మంది ఉద్యోగవిరమణ ప్రొసీడింగ్ అందజేత**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30, ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 11మంది మున్సిపల్ ఉద్యోగవిరమణ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ప్రొసీడింగ్ కాపీలను ఆయన అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవిడ్ సమయంలో మున్సిపల్ సేవలు చాలా గొప్పవని కొనియాడారు. ప్రాణాలకు తెగించి వారు విధులు నిర్వహించినందు వల్లే అప్పుడు వేలాది మంది సురక్షితంగా ఉన్నారని చెప్పారు. శుక్రవారం ఉద్యోగుల విధులకు చివరి రోజు సందర్భంగా కొందరు భావోద్వేగానికి గురయ్యారు. తమ అనుభవాలను పంచుకున్నారు. బి బుచ్చయ్య, టీ చెన్నయ్య, పర్వతయ్య, ఎం పెంటయ్య, ఏ నర్సమ్మ, రామచంద్రయ్య, వీ రాములమ్మ, ఎం ఆశమ్మ, వెంకటయ్య, జోగు చెన్నమ్మ, వై ఎల్లయ్యతో కలిపి 11మంది ఉద్యోగులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా శాలువాలు, పూల బొకేలతో సన్మానించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సన్మానం పొందిన మున్సిపల్ ఉద్యోగులు

## అమృత్ సిటీ నిధులతోనే పాలమూరు పట్టణ అభివృద్ధి..

**ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో నాయకులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30 ప్రభాతవార్త :** పాలమూరు పట్టణంలో చేపట్టిన చౌరస్తాల సుందరీకరణ పనులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అమృత్‌సిటీ అభివృద్ధి నిధులను నుంచి జరుగుతున్నాయని బిజెపి నేతలు తెలిపారు. తొమ్మిదేళ్ల నరెంద్రమోడీ సంక్షేమ పథకాలు అనే నినాదంతో శుక్రవారం మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని బోయపల్లిలో, టిటిగుట్ట ఎక్స్‌రోడ్‌లోని కమల్‌చౌక్‌లో చేపట్టారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు నారాయణయాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్‌పి వెంకటేష్, స్వల్పకాలిక విస్తారక్‌లు డా. చైతన్య, లోకేష్‌లు పాల్గొన్నారు. కేంద్రంలో నరెంద్రమోడీ ప్రధాని ఉండడం వల్ల ప్రతి పేదవాడికి మేలు జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అందులో భాగంగా ఆయుష్మాన్ భారత్ పథకం తెచ్చి పేదలకు వైద్య పరంగా ఎంతో ఆదుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించి ఉజ్వల యోజన కింద ఉచిత సిలిండర్లు ఇచ్చి మహిళలకు అండగా నిలుస్తున్న బిజెపి ప్రభుత్వం అన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలో కూడా నరెంద్రమోడీ ప్రభుత్వ ఉంటే మరిన్ని సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయని వారు ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం యాదవ్, దోమ లక్ష్మినారాయణ, శక్తికేంద్ర ఇంఛార్జులు మెకం అంజయ్య, వేణుగౌడ్, కార్యకర్తలు, నాయకులు జామ్‌శివ, వెంకట్ రాములు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బిజెపి పథకాలను ప్రచారం చేస్తున్న నాయకులు

## వైద్య శిబిరం విజయవంతం

**కల్వకుర్తి, జూన్ 30 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ తనయుడు డాక్టర్ అచల్ ఆధ్వర్యంలో కామినేని డాక్టర్లచే గ్రామంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అచల్ ఆధ్వర్యంలో వైద్య బృందం 292 మందికి బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కర్ణ అంజన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, దారమోని గణేష్, సురేష్, దివాకర్‌గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.



## 2న దేవరకద్రలో ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవం

**దేవరకద్ర, జూన్ 30 ప్రభాతవార్త:** దేవరకద్రలో జులై 2న ఆర్ఎస్ఎస్ దేవరకద్ర శాఖ అధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు శుక్రవారం తెలిపారు. ఆషాడమాసంలో నిర్వహించే ఈ ఉత్సవం ప్రతియొక్క స్వయం సేవకులకు ముఖ్యమైందన్నారు. కావున ప్రతి స్వయం సేవక్ తనకు తానుగా ఈ గురుపూజోత్సవానికి హాజరుకావాలని వారు సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం 8.30లకు ఈ గురుపూజోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు కార్యక్రమానికి 10 నిముషాల మందే రావాలని వారు కోరారు.

## లక్ష్మీపల్లిలో కనకదుర్గాదేవికి మహామంగళ నీరాజనం

**దేవరకద్ర, జూన్ 30 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలోని శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం మహామంగళ నీరాజనం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి దేవస్థానం నిర్వహకులు మొసలి ప్రతాపరెడ్డి, పుష్పలత అధ్వర్యంలో మహామంగళ నీరాజనం పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ అష్టోత్తరములతో కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.



## అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలి...

**వెల్దండ, జూన్30 ప్రభాతవార్త:** గ్రూప్-4 పరీక్ష రాయనున్న అభ్యర్థులు సమయం కంటే 1గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సీఎస్ పుష్పలత తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ పాఠశాలలో గ్రూప్-4 పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 702మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు ఉంటాయని, అభ్యర్థులు పరీక్ష నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. పరీక్ష కేంద్రంలో 15 గదులను ఎంపిక చేశామని, 30 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు సీఎస్, ఇద్దరు సిట్టింగ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



## మూతబడిన పాఠశాలను పరిశీలించిన అధికారులు

**వెల్దండ, జూన్30 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కంటోనిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక ఈ యేడాది మూతబడింది. పాఠశాలను తిరిగి పునః ప్రారంభించాలని గ్రామ సర్పంచ్ రామకృష్ణ గ్రామస్తులతో కలిసి ఎంఈఓ శంకర్‌నాయక్, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు అంజయ్యలను కోరడంతో శుక్రవారం పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందజేస్తున్నామని, విద్యార్థులను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు. నెల రోజులపాటు పాఠశాల నిర్వహణ కొన సాగుతుందని, పాఠశాలకు విద్యార్థులు రాకపోతే పాఠశాలను మూసి వేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేందర్, గ్రామస్తులు వెంకటేష్‌తో పాటు ఉన్నారు.



# గ్రూప్-4 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

## - వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు

**వనపర్తి, జూన్30, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో జూలై 1న నిర్వహించే గ్రూప్ 4 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గ్రూప్ 4 నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జూమ్ మీటింగ్ నిర్వహించగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తు వనపర్తి జిల్లాలో గ్రూప్ 4 పరీక్షలు 13648 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని సదుపాయాలతో కూడిన 46 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అనుభవజ్ఞులైన చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజన్ ఆఫీసర్లు, రూట్ అధికారులను నియమించుకోవడం జరిగిందన్నారు. ఇన్విజిలేటర్లకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి నియమ నిబంధనలపై అవగాహన కల్పించడం జరిగింది. ఉదయం 10 గంటలకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 నుండి రెండవ పేపర్ పరీక్ష ప్రారంభమవుతుందని, దీని కొరకు ఉదయం పరీక్షకు అభ్యర్థులను ఉదయం 8:30 నుండి 9:45 వరకు పరీక్ష కేంద్రంలోని అనుమతించడం జరుగుతుందన్నారు. తరువాత ఒక నిమిషం ఆలస్యం చేసినా పరీక్ష కేంద్రంలో అనుమతించడం జరగదన్నారు. మధ్యాహ్నం పరీక్షకు 1:30 నుండి 2:15 వరకు అనుమతించడంజరుగుతుందన్నారు. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. ఎవరైనా అభ్యర్థులకు హాల్ టికెట్‌పై ఫోటో కనిపించని పక్షంలో 3 పాస్ పోర్టు సైజ్ ఫోటోలపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకుని తీసుకువెళ్లాలన్నారు. ప్రతి అభ్యర్థి తన హాల్ టికెట్‌తో పాటు అదనంగా ఒక గుర్తింపు కార్డును విధంగా వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. దివ్యాంగులు పరీక్ష స్వయంగా రాయలేని వారి కోసం పరీక్ష కేంద్రంలోనే సహాయకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వారు వారి వెంట మరొకరిని తీసుకురావాల్సిన అవసరం లేదన్నారు. గ్రూప్4 పరీక్షకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్ లైన్ నంబర్ 08545-233525కు ఫోన్ చేయాలని తెలియజేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. రూట్ ఆడిటర్లు సకాలంలో చేరుకుని పరీక్షలు సజావుగా నిర్వహించే విధంగా పూర్తి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు144 సెక్షన్ అమలు, జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలను చేరుకునే విధంగా ప్రత్యే రూట్లలో బస్‌లు నడిపేందుకు చర్యలు తీసుకోవడంజరిగిందని తెలిపారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సెక్షన్ సూపరింటెండెంట్ రమేష్ రెడ్డి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

## ఘనంగా వాసవిమాత పల్లకిసేవ



**దేవరకద్ర, జూన్30 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవసానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరి నామశ్చరణల మధ్య ఈ సేవముందుకు కదిలింది. అనంతరం అమ్మ వారి సన్నిధిలో అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదతర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీచక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాద వితరణతదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానకమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మన ఊరును మరిచారు..
## మన బడిని ముంచారు!

■ మన ఊరు మన బడి కార్యక్రమానికి వనపర్తి జిల్లాకు కేటాయించిన బడ్జెట్ రూ.7999.6 లక్షలు
■ ఇప్పటి వరకు పొందిన ఫండ్ ట్రాన్‌ఫర్ ఆర్డర్ 1857.6 లక్షలు


సౌకర్యాలకు దూరమవుతున్న వనపర్తి బాలుర ఉన్నత పాఠశాల

**వనపర్తి విద్యా విభాగం, జూన్30, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలురహై స్కూల్‌ను ప్రారంభించి రాష్ట్రమంతటా పరిచయం చేసిన పాఠశాలను మరిచిపోయి పనులు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం వల్ల పాఠశాలలు బాగుపడ్డాయని, ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మొత్తం జిల్లాలో పాఠశాలల సంఖ్య 518 ఉండగా వాటిలో మొదటి విడతగా 183 పాఠశాలలను, మన ఊరు మన బడి లో ఎంపిక చేశారు. వాటిలో 180 పాఠశాలల్లో పనులు ప్రారంభించగా జిల్లాలో3పాఠశాలల్లో వివిధ కారణాల వల్ల పనులు పెండింగ్ లో ఉన్నాయి. పనులు ప్రారంభించిన 180 పాఠశాలల్లో కేవలం 37 పాఠశాలలు మాత్రమే పూర్తిస్థాయిలో పనులు కంప్లీట్ చేశారు. ఇంకా 138 పాఠశాలలు పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. మిగిలిన 5 పాఠశాలలు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పనుల ప్రారంభానికి కూడా నోచుకోలేదు. వనపర్తి జిల్లాలో మన ఊరు మన బడికి ఎంపికైన అన్ని పాఠశాలలను త్వరగా పూర్తి చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే తమ పిల్లలకు సౌకర్యవంతమైన విద్యను అందించాలని జిల్లా ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

## కేసీఆర్ దళిత వ్యతిరేకి

- సాయిచంద్, ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు ఎందుకు అధికారికంగా నిర్వహించలేదు?
- బీఆర్ఎస్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు గౌరవం లేదు
- కాంగ్రెస్ నాయకుల విమర్శ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**వనపర్తి టౌన్, జూన్30, ప్రభాతవార్త:** వందల మంది విద్యార్థుల ఆత్మ బలిదానాల త్యాగాలపై ఏర్పడిన తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత వ్యతిరేకిగా పాలన కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ఉద్యమకారులు ఎల్.సతీష్, కౌన్సిలర్లు డి.వెంకటేష్, బండారు రాధాకృష్ణ, బ్రహ్మంలు విమర్శించారు. శుక్రవారం వనపర్తి జిల్లాకేంద్రంలోని పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయిచంద్ మృతి పట్ల కాసేపు మౌనం పాటించిన నాయకులు అనంతరం మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమాన్ని పతాకస్థాయికి తీసుకువెళ్లి తన పాటలతో తెలంగాణ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన గాయకుడు సాయిచంద్ అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించకపోవడం బాధకరమని గతంలో కంటోన్మెంట్ దళిత ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు కూడా ప్రభుత్వ లాంఛనాలతో అధికారికంగా నిర్వహించకపోవడాన్ని బట్టి చూస్తు ముఖ్యమంత్రి దళిత వ్యతిరేకిగా వెనుకబడిన జాతులను అణచివేస్తున్నారని వారు ఆరోపించారు. సాయిచంద్ పార్థివదేహాన్ని తెలంగాణభవనానికి ఎందుకు తీసుకువెళ్లలేదని వారు ప్రశ్నించారు.


సాయిచంద్ మృతి పట్ల మౌనం పాటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణ ఏర్పడ్డ తరువాత దళిత ముఖ్యమంత్రిని చేస్తానని ప్రకటించిన కేసీఆర్ దళితులను అణువణువునా మోసం చేస్తున్నారని, దళితులకు మూడు ఎకరాల భూమి ఊసే లేకుండా పోయిందని, ఉప ముఖ్యమంత్రి రాజయ్యను పదవి నుండి దించేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. సాయిచంద్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని సీబీఐ చేత విచారణ జరిపించాలని వారు కోరారు. సాయిచంద్ కుటుంబాన్ని ఆదుకునేందుకు బంజారాహిల్స్‌లో ఒక ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు కోటి రూపాయలు ఆర్థికసాయం చేసి సాయిచంద్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఏమాత్రం గౌరవం లేకుండా పోయిందని మైనార్టీలకు ప్రకటించిన 12శాతం రిజర్వేషన్ అమలు ఏమైందని వారు ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి అప్పట్లో ముస్లీంలకు ప్రకటించిన 4 శాతం రిజర్వేషన్లే నేటికి అమలు అవుతున్నాయని వారు గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధిఅంటే రోడ్లు, ట్యాంక్‌బండ్ల నిర్మాణం కాదని దోచుకోవడం, దాచుకోవడం బీఆర్ఎస్ నాయకులు పెట్టుకున్న ప్రధాన లక్ష్యమని వారు ఆరోపించారు. దళితబంధు పథకం కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే వర్తిస్తుందా అని మిగతా పార్టీలో ఉన్న దళితులు దళిత బంధు పథకానికి అర్హులు కారా అని వారు ప్రశ్నించారు. నిధులు, నీళ్లు, నియామకాలు ఎక్కడికెళ్లాయని కేవలం కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలువచ్చాయని తెలంగాణ ఏర్పడ్డాక నిరుద్యోగుల బతుకులు చిన్నాభిన్నం అయ్యాయనివారు మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో నాయకులు ఫజల్, లతీఫ్, శివ యాదవ్, తిరుపతయ్య, చంద్రశేఖర్ రెడ్డి, అస్లాం తదితరులు ఉన్నారు.

## యువజన ఆత్మీయ సమ్మేలన సభ స్థలాన్ని పరిశీలించిన జడ్పీటీసీ


సభ స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి

**అడ్డాకుల, జూన్30, ప్రభాతవార్త:** అడ్డాకుల మండల కేంద్రంలోని శివారు ప్రాంతం కాటవరం గ్రామ స్టేజీకి ఎదురుగా ఉన్న కృష్ణా నగర్ కాలనీ మాతృశ్రీ స్కూల్ ఆవరణంలో జరిగే యువజన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా పాల్గొననున్న స్థానిక దేవరకద్ర శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి యువజన ఆత్మీయ సమ్మేళనం గురించి యువ నాయకులు, కార్యకర్తలతో సమావేశానికి యువకులజన సమీకరణ సమావేశానికి కావాల్సిన సదుపాయాలు సభాస్థలి ఏర్పాట్ల గురించి చర్చించారు. యువజన ఆత్మీయ సమ్మేళనం జరిగే సభ స్థలం పార్కింగ్ ఏరియా, భోజనశాల స్థలపరిశీలన స్వయంగాజడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించి సభ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి ఘన స్వాగతం


సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మండల ప్రజలు

**వెల్దండ, జూన్30ప్రభాతవార్త:** ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి గత 10 నెలలుగా ప్రతి పల్లె పల్లెన పర్యటించి పల్లెలకు చేరువయ్యారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి కల్వకుర్తి అభివృద్ధే తన ఏజెండా అని ముందుకు సాగారు. గత ఐదు రోజుల క్రితం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కర్గే, ఏఐసీసీ అగ్రనేతరాహులగాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని కడ్తాల్ వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు భారీగా చేరుకొని అక్కడి నుంచి భారీ కాన్వయితో వెల్దండకు విచ్చేశారు. వెల్దండకు విచ్చేసిన రాఘవేందర్‌రెడ్డికి పెద్ద ఎత్తున ప్రజలు హజరై డప్పు వాయిధ్యాలతో స్వాగతం పలుకగా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఐక్యతఫౌండేషన్ ద్వారా విస్తృత సేవలు చేపట్టానని, ఏ పల్లెకు, ఏతండాకు వెళ్లిన సోదరుడిలా, అన్నలా, కుటుంబ సభ్యుడిలా ఆశీర్వదించిన ప్రేమ అప్యాయతలను మరిచిపోనన్నారు. నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్


అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్

**వనపర్తి వైద్య విభాగం, జూన్30, ప్రభాతవార్త:** వర్షాకాలం ఆరంభం కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ పీర్లగుట్ట పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవిశంకర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు, ప్రజలకు వైద్యశాఖ అధికారి ఆరోగ్య సలహాలు ఇవ్వడం జరిగింది. వర్షాకాలం ఆరంభం కావడంతో ఇంటి ఆవరణ నీటి నిల్వ పాత్రలలో దోమలు గుడ్లు పెట్టి దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. నీటి నిల్వ పాత్రలను వారానికిఒక్కసారైనా శుభ్రపరుచుకుని ఉపయోగించుకోవడం మంచిదని తెలిపారు. నీటి డ్రమ్ములు, హౌజ్‌లపై మూతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. లేనిచో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశంఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ఆరంభంలో లార్వా (దోమల గుడ్లు) పగిలిదోమల వృద్ధిగణనీయంగా పెరుగుతుందన్నారు. మనపరిసర ప్రాంతాలు శుభ్రం చేసుకోకపోవడం వల్ల దోమల వృద్ధి పెరిగి దోమకాటుకు రకరకాల వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం చంద్రమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల అంకితభావంతో ఉండాలి

◆ న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత
◆ చట్టాలను స్వయంగా పాటిస్తు ప్రజలకు ఆదర్శంగా నిలవాలి
◆ జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి
◆ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ


మొక్క నాటుతున్న జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి

**వనపర్తి క్రైమ్, జూన్30, ప్రభాతవార్త:** విధుల పట్ల అంకితభావంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అని ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తు ప్రజలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. శుక్రవారం రేవల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీలలో భాగంగా తనిఖీ నిర్వహించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణంలో జిల్లా ఎస్పీ మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్ఐ శివకుమార్ జిల్లా ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ పోలీస్ సిబ్బందికి


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

పలు సూచనలు చేస్తు పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానిత వ్యక్తులు ఎప్పుడు కనిపించినా వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. అక్రమ మార్గంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. నకిలీ విత్తనాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాలు నివారించడానికి కృషి చేయాలన్నారు. ఆర్థిక నేరాలను కట్టడి చేయడానికి సీసీ టీవీ కెమెరాలుఅమర్చే విధంగా ప్రజలను చైతన్యపరచాలని పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి సమాచారమైన డయల్ 100 ద్వారా తెలంవచ్చని సూచించారు. ప్రతి రోజుఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి గ్రామాలలో ప్రజలకు ప్రజాప్రతినిధులకు యువకులకు గ్రామీవీపీవోలు, పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తిడీఎస్పీఆనంద్‌రెడ్డి, వనపర్తి సీఐమహేశ్వర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యతతో కలిగిన బ్రిడ్జి నిర్మించండి



బ్రిడ్జి నిర్మాణం పరిశీలిస్తున్న, మాట్లాడుతున్న జక్కుల ఆశన్న

**వీపనగండ్ల, జూన్30, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రం నుండి గోవర్ధనగిరి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను సీపీఎం మండల నాయకులు ఆశన్న పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... బీటీ రోడ్డు వీపనగండ్ల మండల ప్రజలు ఎన్నో సంవత్సరాల ఆకాంక్ష అని ఆయన అన్నారు. ఈ రోడ్డుకు మధ్యలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించిన తరువాత గోపల్‌దిన్నె క్రాస్ రోడ్డు దగ్గర నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలిస్తు నాసిక రకమైన సిమెంట్, కంకరతో నిర్మిస్తున్నారని, అదే విధంగా ఇక్కడ నీళ్ల ప్రవాహంఎక్కువగా ఉంటుందని పెద్ద పైపులతో నిర్మించాలని, అలాంటిది చిన్న పైపులతో నిర్మిస్తున్నారని వారన్నారు. నీళ్ల ప్రవాహం తక్కువగా ఉండే దగ్గర పెద్ద పైపులతోబ్రిడ్జి నిర్మిస్తున్నారని, నాన్యమైన పైపులను, సిమెంట్, కంకర, వాడాలని వారు కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. బీటీ రోడ్డు పనులు వేగవంతం చేస్తున్నందుకు వారు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రహరీగోడ నిర్మాణానికి భూమిపూజ


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

**అలంపూర్, జూన్ 30 ప్రభాతవార్త:** రూ.5 లక్షలతో ప్రహరీగోడ నిర్మాణం కొరకు ఎమ్మెల్యే డా.వీఎం అబ్రహం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రాజోలి మండలం ముండ్లదిన్నె గ్రామంలో అంగన్‌వాడి భవనానికి ప్రహరీగోడ నిర్మాణం కొరకు రూ. 5 లక్షలు మంజూరు చేసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలంపూర్ ఎమ్మెల్యే డా.వీఎం అబ్రహంతో పాటు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి : ఏడి

**మద్దూరు, జూన్ 30 ప్రభాతవార్త:** మద్దూరు మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్ కార్యాలయం దగ్గర విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా, విద్యుత్ భద్రతకు సంబంధించి ఆ శాఖలో పని చేస్తున్న స్టాఫ్‌కు సేఫ్టీ మెటీరియల్ హ్యాండ్ గ్లౌజులు, హెల్మెట్లు, ఎర్త్‌రాడ్స్ ఇవ్వడం జరిగింది. అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ సుధారాణి మాట్లాడుతూ లైన్ క్లియరెన్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తీసుకున్న తర్వాతనే లైన్ క్లియరెన్స్ ఇవ్వాలని తెలిపారు. వర్షాకాలంలో తప్పకుండా బూట్లు, చేతగ్లౌజులు, తలకు హెల్మెట్ తప్పనిసరి వాడాలని స్టాఫ్‌కు సూచించారు. కార్యక్రమంలో మద్దూరు ఏఈ మహేష్‌గౌడ్, విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జులై 3న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

● పివైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్ ప్రతాప్



మాట్లాడుతున్న పివైఎల్ నాయకులు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రేషన్ షాపుల్లో ప్రజలకు ఇచ్చే 12 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా ఇవ్వాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కమిటి కార్యవర్గ సమావేశం భగత్‌సింగ్ భవన్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్ ప్రతాప్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా రేషన్ షాపుల్లో ప్రజలకు ఇచ్చే 12 రకాల నిత్యావసర సరుకులు పూర్తిగా ఇచ్చేయడమే బంద్ చేయడం జరిగింది. దీంతో ప్రజలు కొనుక్కొని తినడం దానికి తోడు రేట్లు ఆకాశాన్నతాకడంతోసామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం రేషన్ షాపుల్లో 12 రకాల వస్తువులైన చింతపండు, చక్కెర, గోధుమపిండి, మంచినూనె, పసుపు, కారంపొడి, మైదాపిండి, కందిపప్పు రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం5 కేజీల సన్నబియ్యం రాష్ట్ర ప్రభుత్వం ఐదు కేజీల సన్నబియ్యం, వంటగ్యాస్ సగం ధరతో సబ్సిడిపై ఇవ్వాలని, అర్హులైన అందరికి కొత్త రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని, మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలకు కొనుక్కోవడానికి భారంగా మారడంతో ప్రజలునానా ఇబ్బందులు పడుతున్నారని వీటన్నింటిని తెలంగాణ ప్రభుత్వం వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఈ నెల3న రాష్ట్ర సివిల్ సప్లై కార్యాలయం హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ధర్నా కార్యక్రమానికి యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఉపాధ్యక్షులు సిద్ధు, జిల్లా సహాయ కార్యదర్శి సలీం, బాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇస్మాయిల్, రాము, మల్లేష్, కాశి, తిరుమలేష్, రవి, కృష్ణ, హనుమంతు, అంజి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వాసవిమాతకు జడ్పీచైర్మన్ పూజలు



**దేవరకద్ర, జూన్ 30 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీవాసవి కన్యకాప రమేశ్వరి అమ్మవారికి గురువారం రాత్రి జడ్పీచైర్మెన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానికి వచ్చిన సందర్భంగా ఆమెకు దేవస్థాన నిర్వహకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలి కారు. ఈ సందర్భంగా అమ్మవారికి జడ్పీచైర్మెన్ ప్రత్యేక అభిషేకాలు, అర్చ నలు నిర్వహించారు. అషాడమాసం సందర్భంగా అమ్మవారికి జడ్పీచైర్మెన్ పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆమెపై అర్చకుడు హరిశంకరశర్మ అక్షింతలు చల్లి ఆశీర్వచనం పలికారు. అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

## విద్యార్థులకు పాఠశాల సామాగ్రి పంపిణీ

**కల్వకుర్తి, జూన్30, ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో డాక్టర్ దామోదర్‌రెడ్డి మనుమరాలు కుమారి లాస్య జన్మదినం సందర్భంగా సరస్వతి శిశుమందిర్‌లో 10వ తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థులకు ఉచితంగా జామెట్రి బాక్స్‌లు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. 2023 మార్చ్‌లో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 10/10 జి.పి.ఎ సాధించి చి.తేజచారిని రూ.2వేల నగదు బహుమతి అందించి మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు భైరి కరుణాకర్‌రెడ్డి, కార్యదర్శి కుడుముల భాస్కర్‌రెడ్డి, సభ్యులు కటికె శ్రీనివాస్‌రెడ్డి, గందెరవి, కార్యదర్శి మురళీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



బీమా చెక్కును అందజేస్తున్న ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**ఉండవెల్లి, జూన్ 30 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంతో సభ్యత్వం పొందిన అలంపూర్ తాలూకా ఉండవెల్లి మండల కేంద్రానికి చెందిన బిచ్చాల ప్రసాద్ 2002 సెప్టెంబర్ నెలలో యాక్సిడెంట్‌లో మరణించారు. ఈ విషయాన్ని ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా. ఎస్ఎ సంపత్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి ప్రసాద్ మరణానికి సంబంధించిన వివరాలు సేకరించి కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి భీమాకు దరఖాస్తు చేయించగాకాంగ్రెస్ సభ్యత్వ నమోదుతో తక్షణమే రెండు లక్షల రూపాయల చెక్కు మంజూరు కావడంతో శుక్రవారం సంపత్‌కుమార్ ఇంటికి నేరుగా వెళ్లి చెక్కును బిచ్చాల ప్రసాద్ భార్య అయిన బిచ్చాల సుజాతకు వారి తల్లి లింగమ్మకు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా.ఎస్ఎ సంపత్‌కుమార్, ఉండవెల్లి మండల అధ్యక్షులు గోపాల్, చిన్న ఆముదాల సర్పంచ్ నాగేష్, శేర్‌పల్లి సర్పంచ్ నరెంద్ర, రాజిరెడ్డి, మద్దిలేటి, రమేష్, నగేష్ పాల్గొన్నారు.

## పెద్దకొత్తపల్లి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



విధులు నిర్వహించే అధికారులకు సూచనలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్30, ప్రభాతవార్త:** పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రూప్-4 పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పరీక్ష సమయానికి కంటే ఒక గంట ముందే అభ్యర్థులు చేరుకోవాలని, పరీక్ష హాల్‌లోకి పంపే సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాలుఏవి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి పంపించాలన్నారు. విధులు నిర్వహించే అధికారులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

## ఎంపీపీ మేఘారెడ్డిని కలిసిన బలీదుపల్లి గ్రామ ప్రజలు



**పెద్దమందడి, జూన్30, ప్రభాతవార్త:** పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డిని శుక్ర వారం బలీదుపల్లి గ్రామ నాయకులు, ప్రజలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎంపీపీ మేఘారెడ్డికి గ్రామ సమస్యలను వివరించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న టీఎంఆర్ యువసేన నాయకులు

**పెద్దమందడి, జూన్30, ప్రభాతవార్త:** పానుగంటి మాసయ్య మృతి చెందిన విషయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నియోజవర్గ నాయకులు, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణమే ఆయన స్పందించి దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయాన్ని పంపించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, టీఎంఆర్ యువసేన నాయకులు మృతుని కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో ఎంపీటీసీ భర్త లక్ష్మారెడ్డి, రవిచంద్రారావు, మన్యపురెడ్డి, డీలర్ రమేష్‌గౌడ్, నరసింహ, యాదయ్యగౌడ్, బుచ్చారెడ్డి, పానుగల్ వెంకటయ్య, మీసాలలక్ష్మయ్య, కురుమూర్తి, ఆంజనేయులు, మహిళలు టీఎంఆర్ యువసేన నాయకులు ఉన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**వనపర్తి, జూన్30, ప్రభాతవార్త:** వనపర్తి మండల పరిధిలోని దత్తాయిపల్లి గ్రామానికి చెందిన నాగశేషయ్యకు చెందిన కోళ్ల షెడ్డు అతివేగంగా వీచిన ఈదురుగాలులకు కూలిపోయింది. ఈ విషయాన్ని గ్రామస్తులు వనపర్తి నియోజకవర్గనాయకులు, పెద్దమందడి ఎంపీపీ తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన వెంటనే స్పందించి రూ. 25వేలు ఆర్థిక సాయాన్ని శుక్ర వారం బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేఘారెడ్డి వెంట వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు సత్యారెడ్డి, పొలికెపాడుమాజీ సర్పంచ్ సత్య శీలారెడ్డి, వెల్టూరుసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మనిగిల్ల తిరుపతిరెడ్డి, అనకాపల్లితాండఉపసర్పంచ్ అంజి నాయక్, శివయాదవ్, స్వామి ఉన్నారు.

**PUBLIC NOTICE**

The Public in General are hereby notified that my client Sri Gone Chandra Reddy S/o Late Sri Venkat Reddy, R/o Kothwalguda Village, Shamshabad Mandal, R.R. District. Telangana,. Who is enter Agreement of Sale with the land owners by name 1) Mangalarapu Vittalaiah 2) Errabapu Esrayal 3) Anil Kumar Golkonda 4) Golkonda Anthi Reddy 5) Barigela Sudarshan. The above said 1 to 5 are the owners of the land Admeasuring Ac. 02-00 Gts, in Survey 720/E Part, Situated at Chilver Village, Midjil Mandal, Ranga Reddy District, Telangana. In turn the above land acquired through Registered Sale Deeds from Jinka Sailu, Jinka Chinna Laxmamma, Jinka Pedda Laxmamma. That the above said land along with boundaries. All that the open land admeasuring Ac 00-07 Gts in Sy no 720/E1/3/3, land admeasuring Ac 00-07 Gts in Sy no 720/e1/3/2, land admeasuring Ac 00-05 Gts in survey no 720/e1/3/1, land admeasuring Ac 00-20 Gts in Sy no 720/E1/3/2, land admeasuring Ac 00-19 Gts in Sy no 720/ E1/3/1, land admeasuring Ac 00-20 Gts in Sy no 720/E1/3/3, land admeasuring Ac 00-02 Gts in Sy no 720/E1/ 3/3/1/1/1, Total land admeasuring Acr 02-00 Gts, situated at Chilveru Village, Midjil Mandal, Mahaboob Nagar District, Vendors no 1 to 5 have common boundaries bounded by: **North :** Land of Epalapally Ballaih. **South :** Kasinath and Ramakrihnaiah. **East :** BITI ROAD and Epaapally Anjaiah. **West :** Land of Epalapally Peddda Anjaiah.

That my client ready to register the above said Agricultural land in his favor, in that hear by announce to through this public notice any body having any interest or any rights in the above said land come forward with the Related documents within 7 days, otherwise any rights in the said land will be forfeited by not interested.

If any person are persons having any transaction of the above said Agriculture Lands, from the date of publication of this notice, the said documents not binding on my client and also not valid transaction and further it will be not entertained.

**K. GOVARDHAN REDDY**
Advocate
Office: # 22-45/1,
Rallaguda, Shamshabad,
R R Dist - 501 218.
**Ph No: 9866378143**

## బిజెపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**లింగాల, జూన్ 30 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాలలో వివరిస్తూ బూత్‌స్థాయి నుంచి బిజెపిని బలోపేతం చేయాలని, రాబోయే ఎన్నికల్లో బిజెపి గెలుపుకోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని బిజెపి కేంద్ర పరిశీలకుడు విస్తారక్ మనోజ్ అన్నారు. శుక్రవారం జాతీయ బిజెపి పార్టీ చేపట్టిన మేరా బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా కర్ణాటక నుండిపరిశీలకునిగా వచ్చిన విస్తారక్ మనోజ్‌కు మండల బిజెపి అధ్యక్షులు యాదగిరి సలే శ్వరం ఆధ్వర్యంలో కార్యకర్తలు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కోళ్ల శ్రీనివాసులు, హరితేజగౌడ్, విష్ణుచారి, మహేష్, సాయిసాగర్, రాజేష్ పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ విధులు అత్యంత బాధ్యతయుతమైనవి

● అంకిత భావంతో పని చేయాలి : నారాయణపేట జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం ధన్వాడ పోలీస్ స్టేషను వార్షిక తనిఖీ నిర్వహించారు. ముందుగా పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది పరేడ్‌ను పరిశీలించి సిబ్బంది యూనిఫామ్స్ నీట్ టర్న్ అవుట్‌ను చెక్‌చేసి సిబ్బంది క్రమశిక్షణ కలిగి ఉండి, సమయ పాలన పాటించాలని తెలిపారు. పోలీస్ సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్నకేసులు, దర్యాప్తు వివరాలను ఎస్సై, సిఐలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో రోజువారిగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల రికార్డులు పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, మెన్ బ్యారెజ్ పరిశీలించి పోలీస్‌స్టేషన్‌లో 5ఎస్ ఇంప్లిమెంటేషన్ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ అత్యంత బాధ్యతాయుతమైన వ్యవస్థ అని, విధుల పట్ల అంకిత భావంగాఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడుఅందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అని, ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రేవ్ కేసులో జాప్యం లేకుండా త్వరితగతిన నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాలని తెలిపారు. నిందితులకు శిక్షలు పడేలా భౌతిక సాక్ష్యంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలని తెలియజేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. దొంగతనాల నిర్మూలనకు నిఘా ఏర్పాటు చేయాలని, ఎటువంటిఅసాంఘిక కార్యకలాపాలు పాల్పడకుండా పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. రహదారి వెంట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలని తెలియజేశారు. ఆర్థిక నేరాలకు కట్టడి చేయడానికి సిసి టివి కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్యపర్చాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై, 1930 టోల్ ఫ్రీ నంబర్ పై ప్రజలకు అవగాహన కల్పించాలనిసూచించారు. ప్రజలు తీసుకొచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు భద్రతా, భరోసా కల్పించే విధంగా పోలీస్ వ్యవస్థ ఉండాలని ప్రజలు ఎటువంటి సమాచారమైనా డయల్ 100 ద్వారా తెలుపవచ్చని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులు క్రమపద్దతిలో ఉంచాలని సిఐ, ఎస్సైలను ఎస్పీసూచించారు. కార్యక్రమంలో సిఐశ్రీకాంత్‌రెడ్డి, ఎస్సై రమేష్, ఎఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎస్పీ

## గ్రూప్-4 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు : జిల్లా ఎస్పీ

⬢ 28 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త:** నేడు టీఎస్‌పిఎస్‌సి గ్రూప్ 4 ప్రిలిమినరీ రాత పరీక్ష సందర్భంగా నారాయణపేట జిల్లాలో మొత్తం28 సెంటర్లను8 రూట్లుగా విభజించడం జరిగింది. నారాయణపేటలో 4 రూట్లలో 17 సెంటర్లు ఉన్నాయి. మక్తల్ 2 రూట్లలో 5 సెంటర్లు ఉన్నాయి. కోస్గిలో 2 రూట్లలో 6 సెంటర్లు ఉన్నాయి. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని పరీక్ష ముగిసే వరకు నిరంతరం రూట్ మొబైల్స్‌తో పెట్రోలింగ్ నిర్వహించడంజరుగుతుందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో మొత్తం 28 కేంద్రాల వద్ద సిఆర్‌పిసి 144 సెక్షన్ విధించడం జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లు, చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు మూసివేయాలని, పరీక్ష సెంటర్ల వద్ద నుండి 100 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులనుద్దేశం చి మాట్లాడుతూ పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకో వాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు సూచించారు.



# ఘనంగా అంతర్జాతీయ ఖోఖో దినోత్సవం

- వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులను ప్రొత్సహించిన జిల్లా ఎస్పీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్30 ప్రభాతవార్త:** అంతర్జాతీయ ఖోఖో దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులను నాగర్‌కర్నూల్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ లీస్ వారి సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ వారి అనుబంధంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ మనోహర్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తికి సంబంధించిన క్రీడాకారులను మరియు వ్యాయామ విద్య, ఉపాధ్యాయులను నాగర్‌కర్నూల్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలిస్ మీటింగ్ హాల్‌లో జిల్లా ఎస్పీ మనోహర్ క్రీడాకారులకు వ్యాయమ విద్య ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన జిల్లాలో జాతీయ స్థాయితో పాటు అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆయన సూచయించారు. ప్రతి రోజు క్రీడలు ఆడటం వల్ల శారీరక ధృడత్వంతో పాటు మానసిక రుగ్మతలను దూరం చేసుకోవచ్చునని, క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పొందవచ్చునని, దీంతో పాటు మంచి క్రమశిక్షణ కలిగి ఉండటం వలన సమాజంలో మంచి పేరు కూడా తెచ్చుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సన్మానం పొందిన క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులు పీడీమణి బల్మూర్, నీలబాయి పీఈటీ అచ్చంపేట, యాదయ్య పెద్దపల్లి, కృష్ణ తుడుకుర్తి, సందీప్ కల్వకుర్తి, సికిందర్, సయ్యద్, లలిత వెల్దండ, పార్వతమ్మ తుర్కలపల్లి. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ప్రకాష్, పీఈటీ పురంచంద్, మోహన్‌లాల్, కుర్మయ్య, రవికుమార్, రాఘవులుగౌడ్, శేఖర్, నిరంజన్‌యాదవ్, సామ రమేష్ ఉన్నారు.



వ్యాయామ విద్య ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ

# గడప గడపకు మోడీ సంక్షేమ పథకాలు

**వెల్దండ, జూన్30, ప్రభాతవార్త:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 9 సంవత్సరాల కాలంలో గడప గడపకు మోడీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని బీజేపీ నేత తల్లోజు ఆచారి అన్నారు. బహుజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా వెల్దండ మండలంలోని చొక్కన్నపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు బీజేపీ కార్యక్రమానికి ఆచారి పాల్గొని మోడీ సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, గ్రామంలోని సీసీ రోడ్ల నిర్మాణాలు, ఇరువైపులా చెట్లు నాటించడం, డంపింగ్‌యార్డ్, రైతు వేధిక, పీఎం కిసాన్ యోజన, సుకన్య యోజనతో పాటు అందిస్తున్న పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. దేశ ప్రజలందరికి నరేంద్ర మోడీ కుటుంబ పెద్దగా అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, నర్సింహ్మా, విజయేందర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి బాలస్వామి, సత్యనారాయణచారి, శ్రీనివాసాచారి, రవికుమార్, యాదయ్య, పరమేష్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



ఇంటింటి అవగాహన కార్యక్రమంలో తల్లోజు ఆచారి

# టిఎస్ఐ పాస్ దరఖాస్తులకు అనమతులు ఇవ్వాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30 ప్రభాతవార్త:** టిఎస్ ఐపాస్ కింద పరిశ్రమల స్థాపనకై వచ్చిన దరకాస్తులను పరిశీలించి నిర్దేశించిన సమయంలో అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఆదే శించారు. శుక్రవారం తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లాపరిశ్రమ ప్రోత్సాహక కమిటి, టిఎస్ ఐపాస్, టి ప్రయిడ్ సమావేశంలో 2014 టిఎస్ఐ పాస్ చట్టం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన అన్ని దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు సకాలంలో పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా అనుమతులు ఇవ్వాలని చెప్పారు. టీప్రైడ్ కింద షెడ్యూల్డు కులాల లబ్దిదారులకు సబ్సిడి ప్రోత్సాహంగా ఇచ్చే పథకాలు, అదేవిధంగా షెడ్యూల్డు తెగలు, దివ్యాంగులకు ఇచ్చే పథకాలపై సమీక్ష నిర్వహించారు. జూన్ నెలాఖరు నాటికి జిల్లాలో టిఎస్ ఐపాస్ కింద 1520 దరఖాస్తులు పరిశ్రమల అనుమతికై రాగా, 1450 దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు ప్రాథమిక పరిశీలన చేయటం అనుమతులు ఇవ్వడం చేసినట్లు ఆయన తెలిపారు. టీప్రైడ్ కింద షెడ్యూలు కులాల లబ్దిదారుల కేటగిరిలో ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులను, అలాగే ఎస్సీ కేటగిరి కింద వచ్చినదరఖాస్తులు, దివ్యాంగుల దరఖాస్తులకు కమిటి అనుమతులు ఇచ్చింది. ఆయా పథకాల కింద యూనిట్లు పొందిన లబ్దిదారులు వాటిని నిరంతరం నడుపుకునే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ బాబురావు, ఎల్డీఎం భాస్కర్, డిటిసిపిఓ శేఖర్, గ్రౌండ్ వాటర్ డిడి రాజేందర్‌కుమార్, డిఎఫ్ఓ కిశోర్, ఎస్సీ కార్పోరేషన్ ఈడియాదయ్య, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ రవిందర్, మోటార్ వాహనాల ఇన్స్‌పెక్టర్ నరేష్, డిపిఓ వెంకటేశ్వర్లు, ఏసీ లేబర్ యాదయ్య సమావేశానికి హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి. రవినాయక్

# రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా. సంపత్‌కుమార్

**ఉండవెల్లి, జూన్ 30 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గం ఉండవల్లి మండలంలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో సంపత్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని తెలంగాణ రాష్ట్రంలో, దేశంలో ఇప్పుడు రాజకీయాలు రోజు రోజుకు మారుతున్నాయని ప్రజలంతా కాంగ్రెస్ వైపు మల్లుతున్నారని ప్రజలు బిఆరెఎస్‌ని నమ్మే పరిస్థితిల్లో లేరు. బిఆర్ఎస్‌లో అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు అనేది కూడా స్పష్టం చేయడం లేని పరిస్థితి నెలకొంది. ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నందుకు రాబోయ ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. అనంతరం పలువురు గ్రామస్తులు, యువకులకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా.ఎస్ఎ సంపత్‌కుమార్, ఉండవల్లి మండల అధ్యక్షులు కురువగోపాల్, అలంపూర్ మండలఅధ్యక్షులు రాము, మానవపాడు మండల అధ్యక్షుడు జగన్మోహన్‌నాయకుడు, శేర్‌పల్లి సర్పంచ్ నరెందర్‌నాయుడు, చిన్న ఆముదాల సర్పంచ్ నగేష్, రాజిరెడ్డి, నర్సగౌడ్, రమేష్, మద్దిలేటి, ఉండవల్లినాగరాజు, నయీం, పాండు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామస్థాయినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దృశ్యం

## మూడంచెల పటిష్టమైన బందోబస్తు

● గ్రూప్ 4 పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

● మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్30 ప్రభాతవార్త :** నేడు టిఎస్‌పిఎస్‌సి గ్రూప్ 4 రాత పరీక్షలు అభ్యర్థులు నిబంధనలను అనుసరించి ప్రశాంతంగా రాయాలని జిల్లా ఎప్పీ కె. నరసింహ సూచించారు. పరీక్షల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 111 సెంటర్లు ఉన్నాయన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టబందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష ముగిసే వరకు నిరంతరం రూట్ మొబైల్స్‌తో పెట్రోటింగ్ నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో మొత్తం 111 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్ నెట్ సెంటర్లు, చుట్టు పక్కల లౌడ్ స్పీకర్లు, మూసివేయాలని, పరీక్ష సెంటర్ల వద్ద నుండి 100 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని, పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు బయోమెట్రిక్ మాదిరిగా ఫింగర్ ప్రింట్ తీసుకోవడం జరుగుతుందన్నారు. అభ్యర్థుల ఫోటో గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతిస్తారని తెలిపారు. పరీక్షకు 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయబడతాయని తెలిపారు. ఉదయం పేపర్ 1 పరీక్ష రాసేవారు సమయం 9.45, పేపర్ 2 పరీక్ష రాసేవారు 2.15 గం.ల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడదన్నారు. డౌన్‌లోడ్ హాల్ టికెట్‌లో ఉన్న నిబంధనలు అభ్యర్థులు చదువుకొని వాటిని పాటించాలని సూచించారు. చివరి నిమిషంలోవచ్చి ఇబ్బందిపడకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు. షూ వేసుకుని పరీక్షా కేంద్రానికి రావద్దని సూచించారు.

## బిసిల కులవృత్తుల దరఖాస్తుల విచారణ

**ఇటిక్యాల, జూన్ 30 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం బిసి కులాలలోని కులవృత్తులను ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం ఒక కుటుంబానికి 1 లక్ష రూపాయలను నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలోకి జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా లబ్దిదారుల నుండి ఆన్‌లైన్ పద్ధతి ద్వారా దరఖాస్తులను స్వీకరించగా మండల పరిధిలోని 33 గ్రామాలలో 1246 మంది కులవృత్తుల ఆధారంగా దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపిడిఓ రాఘవ తెలిపారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రం లోని ఇటిక్యాలలో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారు చేస్తున్న కులవృత్తులపై వారి జీవనాధారం వెంటనే అంశాలు ఎంపిడిఓ రాఘవ, స్థానిక పంచాయతీ కార్యదర్శి నాగరాజుతో కలిసి విచారణ చేపట్టారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి ఈనెల మూడో తేదీలోగా పూర్తి చేయాలని గ్రామాల పంచాయతీ కార్యదర్శులనుఎంపిడిఓ రాఘవ ఆదేశించారు. అంతేకాక దరఖాస్తు ధరల నుండి అన్ని ధృవపత్రాలను రెండు సెట్లు జిరాక్స్ కాపీలు అలాగే వారు చేస్తున్న కుల వృత్తుల ఆధారమైన ఫొటోను కూడా సేకరించాలని పకడ్బందీగా ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన కులవృత్తుల లబ్దిదారుల వివరాలను సేకరించాలని ఎంపిడిఓ రాఘవ కార్యదర్శులను ఆదేశించారు.



బిసి కులవృత్తుల దరఖాస్తుదారులను విచారిస్తున్న ఎంపిడిఓ రాఘవ

## మానవులు మోక్షమార్గాన్ని కోరుకోవాలి



బీచుపల్లి కోదండ రామాలయంలో మహదాంధ్ర భాగవత సప్తాహం వినిపిస్తున్న శిష్యబృందం

**ఇటిక్యాల, జూన్ 30 ప్రభాతవార్త:** మానవులు భగవంతుని చేరుకునేందుకు చేస్తున్న తాపత్రయంతో పాటు మోక్షమార్గాన్ని కోరుకోవాలని చిన్నజీయర్ స్వామి రామానుజ శిష్యబృందం గోపాల్‌దిన్నె సత్యం, మునగాల సతీష్‌లు వివరించారు. మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో గల కోదండ రామాలయంలో గద్వాల వికాస్‌తరంగిణి ఆధ్వర్యంలో 7రోజులపాటు జరుగుతున్న శ్రీమహదాంధ్ర భాగవత సప్తాహం కార్యక్రమంలో భాగంగా చివరిరోజు శుక్రవారం పారాయణం చేశారు. 7 రోజులపాటు భాగవతంలోని 12 స్కందాలు మహావిష్ణువు గొప్పతనంమహిమలను వివరిస్తూ 27అవతారాల గురించి పారాయణం చేసినట్లు శిష్యబృందం తెలిపారు. ముగింపు కార్యక్ర మానికి పాలకమండలసభ్యులు భీమేశ్వర్‌రెడ్డి, ఆలయమేనేజర్ సురేంద్రరాజు తదితరులు హాజరై పారాయణం చేసిన వారిని సన్మానించినట్లు మేనేజర్ తెలిపారు.

## గ్రూప్ 4 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్, ఎంపిడిఓ



**ఇటిక్యాల, జూన్30 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాల నియామకం కోసం గ్రూప్ 4 ఉద్యోగాల పరీక్ష నిర్వహణ కోసం మండలంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ సుబ్రమణ్యం, ఎంపిడిఓ రాఘవ తెలిపారు. గ్రూప్ 4 పరీక్ష శనివారం నిర్వహిస్తుండగా కొండేరు, బీచుపల్లి గురుకుల పాఠశాల, ఎర్రవల్లి చౌరస్తాలో ఏకశిలా ఇంటర్నేషనల్ పాఠశాల పరీక్షా కేంద్రాలను తహసిల్దార్ సుబ్రమణ్యం, ఇటిక్యాల మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన బిఎ పరీక్ష కేంద్రాన్నిఎంపిడిఓ రాఘవ పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అజిత్, పంచాయతీకార్యదర్శి నాగరాజు, పాఠశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

## ప్రహరీగోడకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

**మక్తల్, జూన్30 ప్రభాతవార్త:** సంగంబండ రోడ్డు కస్తూర్బా బాలికల పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మక్తల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావని భూమిపూజ చేశారు. చల్లటి స్నానం వల్ల తరచూ జలుబు, జ్వరంతో అనారోగ్యం గురవుతున్నామని అందుకు తమకు వేడినీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థినిలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పేద, మధ్య తరగతి కుటుంబాల బాలికలకు కార్పోరేట్ వసతులతో చదువుకోవడానికి ప్రతి మండలంలో కస్తూర్బా పాఠశాలను ఏర్పాటు చేసిందని విద్యార్థినిలకు అన్ని వసతులు కల్పిస్తున్నదని అన్నారు. కస్తూర్బా హాస్టల్‌లో చదివిన విద్యార్థులు ఇంజనీర్ వైద్య ఇతరత్ర కోర్సుల్లోసీట్లు సాధించారని అందుకు ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకుని బోధించిన టీచర్లకు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ నాగశివ, ప్రిన్సిపల్ సిబ్బంది పార్టీ నేతాజీ, ఈశ్వర్, మైపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, సాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రహరీ గోడకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే